ఈవీఎంల పరిశీలన : కలెక్టర్

రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని మార్కెట్‌యార్డులో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ అరుణ్ బాబు శనివారం పరిశీలించారు. గోడౌన్‌లో ఉన్న ఈవీఎంలను క్షుణ్ణంగా పరిశీలించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతిమూడు నెలలకు ఒకసారి ఈవీఎంలను పరిశీలించాల్సి ఉందన్నారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో తనిఖీలు చేశామన్నారు. అనంతరం పలు విషయాలను ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి ద్వారా తెలుసుకున్నారు. ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతను కొనసాగించాలని డీఎస్పీ శ్రీనివాసులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రమేశ్‌బాబు, వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం ఉన్నారు.

వానలొచ్చినా.. ముందుకు సాగని సాగు..!

◆ గతేడాది కంటే తక్కువే విత్తనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంచి వర్షాలు పడ్డాయి. 63 మండలాల్లోను పదునైంది. అయినా పంటల సాగు ఆశించినంత ముందుకు సాగలేదు. సాగుకు ఇంకా సమయముందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం ఆశాజనంగా సాగింది. సాధారణం కంటే గణనీయంగా వర్షపాతం అంతటా పడింది. జూన్ మొదటి రెండు వారాల్లోనే ఇది నమోదయినప్పటికీ ఆ తరువాత మూడవ వారం నుంచి పూర్తిగా వానలు పడకుండా కారుమబ్బులు కమ్ముకుని రావడం వర్షం చినుకు నేల రాలకపోవడం జరుగుతోంది. తిరిగి ఎప్పటిలాగానే రైతు ఆకాశం వైపు పదును కోసం ఎదురు చూడాల్సిన వస్తోంది.

గతేడాది కంటే తక్కువే సాగు

వర్షాలు బాగాపడ్డాయని భావిస్తున్న తరుణంలోనూ సాగు గతేడాది కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. గతేడాది ఇదే సమయానికి అనంతపురం జిల్లాలో 3,22,271 ఎకరాల్లో పంటలు సాగయితే ఈసారి 25,896 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఇక సత్యసాయి జిల్లాలో 47,393 ఎకరాల్లో విత్తనం పడితే ఇప్పుడు 38,587 ఎకరాల్లోనే విత్తనం వేశారు. అదే ప్రధాన పంట వేరుశనగ సాగు అదే విధంగా ఉంది. మొత్తం ఈ ఏడాది 4.88 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగవుతుందని అంచనా వేస్తే ఇప్పటి వరకు సాగైంది. 11,299 ఎకరాల్లోనే. అదే గతేడాది ఇదే సమయానికి 14,408 ఎకరాలు. సత్యసాయి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ 4.32 లక్షల ఎకరాల్లో సాగవుతుందన్నది వ్యవసాయాధికారుల అంచనా. ఇప్పటి వరకైంది 26,158 ఎకరాలు. గతేడాది ఇదే సమయానికి అయిన సాగు 38,948 ఎకరాలు. ఇతర పంటల సాగుకు నామమాత్రంగానే ఉంది.

పడిన వర్షం అధికం

అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం జూన్ నెలాఖరు వరకు 60.7 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 147.6 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 143.2 మిల్లీమీటర్లు పడింది. సత్యసాయి జల్లాలో 65.7 మిల్లీమీటర్లకుగానూ 148.5 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 126 శాతం అధికంగా పడింది. ఈ వర్షపాతంలో అత్యధికంగా నెల మొదటి రెండు వారాల్లోనే నమోదయింది. ఆ తరువాత మూడవ వారం నుంచి చినుకు జాడలేదు. విత్తనం విత్తుకోవడానికి ఇదే సరైన సమయం. చినుకుజాడలేకపోవడంతో నేలలో తేమ లేక రైతులు సరైన సమయంలో విత్తనం విత్తుకునేందుకు ఆకాశం వైపు ఎదురు చూసే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ సమయంలో ఒక్క పదును అయితే సాగు విస్తీర్ణం ఆశించినంత జరిగేందుకు అవకాశం ఉంటుంది.

అనుమతులిస్తారా.. తీసుకున్న డబ్బులు ఇస్తారా..?

పాలకపక్ష కౌన్సిలర్లను నిలదీసిన వ్యాపారులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పరిగి బస్టాండ్ ఆవరణంలో టోకు వ్యాపారులకు కేటాయించిన స్థలాన్ని ఖాళీ చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి కూరగాయల టోకు వ్యాపారులకు నోటీసులను జారీ చేశారు. దీంతో ఒక్కసారిగా టోకు వ్యాపారులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ శనివారం చైర్ పర్సన్ ఛాంబర్ లో చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు పాలకపక్ష కౌన్సిలర్లను నిలదీశారు. అనుమతులను మంజూరు చేయిస్తారా లేదా తాము ఇచ్చిన డబ్బులను వెనక్కి ఇస్తారా అంటూ ప్రశ్నించారు. దాదాపు గంటకు పైగా చైర్ పర్సన్ ఇంద్రజ, పలువురు కౌన్సిలర్లు కూరగాయల టోకు వ్యాపారులతో చర్చించారు. అయినప్పటికీ వ్యాపారులు ససేమిరా అన్నారు.కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని పిలిపించి వారికి న్యాయం చేయాలని చైర్ పర్సన్ తో పాటు పాలక సభ్యులు కోరారు. అయితే నిబంధనల మేరకు బహిరంగ వేలం పద్ధతిలో స్థలాలు తీసుకుంటే తమకు అభ్యంతరం లేదని, బహిరంగ వేలం వేయకుండా స్థలాలు అప్పగించే ప్రసక్తే లేదన్నారు. దీనిపై టోకు వ్యాపారులు బహిరంగ వేలం వేయకుండానే స్థలాలకు అనుమతులు మంజూరు చేసి ఇస్తామని నమ్మించి గతంలో ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ లక్ష రూపాయల్లో ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. ఈయనతో పాటు కౌన్సిలర్లు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. గతంలో పురపాలక సంఘానికి చెల్లిస్తామని తీసుకొచ్చిన డబ్బులను సైతం పాలకవర్గ కౌన్సిలర్లే తీసుకున్నారని. లక్షలాది రూపాయలు పాలకవర్గానికి సమర్పించుకున్నప్పటికీ తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు మంజూరు చేయించి ఇవ్వడానికి సాధ్యం కానీ పక్షంలో తమ వద్ద తీసుకున్న డబ్బులు వెంటనే వెనక్కి ఇవ్వాలన్నారు. ఈ డబ్బులతో పాటు గత కమిషనర్ కు ఇచ్చిన రూ.5 లక్షలు అతని నుంచి వసూలు చేస్తామని, ఇవ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇచ్చిన ప్రతి పైసాకు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. చివరకు చైర్ పర్సన్ కొంతమంది కౌన్సిలర్లు కాస్త గడువు ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని కోరడంతో టోకు వ్యాపారులు వెళ్లిపోయారు. వీరితో పాటు పూల వ్యాపారులు సైతం తమకు న్యాయం చేయాలని తాము కూడా పాలక పక్ష కౌన్సిలర్లకు లక్షలాది రూపాయలు ఇచ్చామని, అధికారికంగా మాకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిని బట్టి పురపాలక సంఘంలో పాలకవర్గ సభ్యులు అప్పటి కమిషనర్ తో కలిసి ఇంత పెద్ద అవినీతికి పాల్పడ్డారో తెలుస్తోంది. ఈ అంశాలపై స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక దష్టి సారించి వ్యాపారం నుంచి అడ్డంగా దోచుకున్న సొమ్మును వారికి ఇప్పించి, వ్యాపారులకు వ్యాపారులు చేసుకోవడానికి తగిన స్థలాన్ని చూపించే విధంగా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

కదిరి ప్రభుత్వాసుపత్రిలో మహిళ మృతి

బంధువుల ఆందోళన

మృతి చెందిన తులసమ్మ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-కదిరి అర్బన్

చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి వచ్చిన ఓ మహిళ మరణించింది. డ్యూటీ డాక్టర్లు సకాలంలో వైద్య చికిత్సలు అందించకపోవడం వల్లనే ఆమె మరణించిందంటూ బంధువులు శనివారం ఉదయం ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మృతురాలి కుమారుడు వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడుతూ కదిరి పట్టణం వాణిస్ట్రీట్‌కు చెందిన తులసమ్మ(50) శరీరంపై బొబ్బలు రావడంతో చికిత్స నిమిత్తం ఈ నెల 18వ తేదీ మంగళవారం నాడు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లామన్నారు. వైద్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చుకున్నారన్నారు. ఆసుపత్రిలో చేర్చుకున్నప్పటి నుంచి డ్యూటీలో ఉన్న నర్సులు, డాక్టర్లు ఎలాంటి చికిత్సలూ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రంతా వాంతులు అవుతున్నాయని పదేపదే సిబ్బందికి తెలియజేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఊపిరి ఆడక ఇబ్బంది పడుతున్నా కనీసం ఆక్సిజన్ కూడా పెట్టలేదన్నారు. ఇలా ఇబ్బంది పడుతూనే 19వ తేదీ బుధవారం మా అమ్మ మరణించిందన్నారు. డ్యూటీ డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల మరణించిందని వైద్యులను ప్రశ్నిస్తే తమనే బెదిరించారన్నారు. మృతదేహాన్ని తీసుకెళ్లకుంటే మార్చురీకి తరలిస్తామని చెప్పడంతో చేసేది లేక అక్కడి నుంచి వచ్చేశామన్నారు. సకాలంలో స్పందించి వైద్య పరీక్షలు చేసి, చికిత్సలు అందించి ఉంటే మా అమ్మ బతికేదని వెంకటేశ్వర్లు కన్నీటి పర్యంతం అయ్యారు. తమలాగా మరొకరికి ప్రాణ నష్టం జరగకూడదన్న ఉద్దేశంతో శనివారం నాడు ఆసుపత్రికి వచ్చి వైద్య సిబ్బందికి ఫిర్యాదు చేశామన్నారు. వైద్య చికిత్సలు అందించకుండా తమ అమ్మ మృతికి కారణమైన డ్యూటీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

విచారణ జరిపిస్తాం

హుస్సేన్, సూపరింటెండెంట్.

తులసమ్మ మృతిపై ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తామని కదిరి ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. వైద్యులు, సిబ్బంది తప్పిదం ఉంటే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని విధాలా దీనిపై సమగ్ర విచారణ చేస్తామని తెలియజేశారు.

లింగవివక్ష నిర్మూలనకు పాటుపడదాం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

లింగ వివక్ష నిర్మూలనకు పాటుపడదామని డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సాల్మాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక డిప్యూటీ డిఎంహెచ్ఒ కార్యాలయంలో లింగవివక్షత నిర్మూలనపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సెల్వియా సాల్మాన్ మాట్లాడుతూ ధర్మవరం సబ్ డివిజన్లో 11 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ఇందులో ప్రభుత్వ ఆస్పత్రిల్లో రెండు, ప్రైవేటు ఆస్పత్రిలలో 9 సెంటర్లు ఉన్నాయన్నారు. అయితే ఈ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేయడం, ఆడపిల్లలు అయితే అబాషర్షన్లు చేయడం వంటివి చట్ట వ్యతిరేకమన్నారు. అటువంటి వారిని చట్టపరంగా శిక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారి బాబాఫకృద్దీన్, టూటౌన్ సిఐ అశోక్ కుమార్, గైనకాలజిస్టు శైలజ, శ్రావణి, రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, అన్నమయ్య సేవామండలి అధ్యక్షులు పొరాళవుల్లయ్య, అయ్యప్ప సేవా సమితి సభ్యులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ

జామియా మసీద్ ముతవల్లిగా సయ్యద్ బాషా

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని జామియా మసీద్ ముతవల్లిగా మండల కేంద్రానికి చెందిన సయ్యద్ భాషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జామియా మసీదులో ఏర్పాటు చేసిన సమావేశంలో ముతవల్లితో పాటు ప్రెసిడెంట్‌గా ఫోటో స్టూడియో ఫక్రుద్దీన్, సెక్రటరీగా మహబూబ్ బాషా, సాదక్ భాష, సలహాదారులుగా జబ్బార్, షామీర్ భాష తోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మసీదుల అభివృద్ధికి తమ వంతు కషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

హిందూపురంలోని ఓ సచివాలయంలో కార్యదర్శులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీ కుర్చీలు

పాలన పట్టాలెక్కేదెప్పుడో..!

◆ బదిలీల కోసం మండలస్థాయి అధికారుల ఎదురుచూపు ◆ ప్రజా సమస్యలపై నేతల సిఫార్సు మేరకే అధికారుల స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. కేంద్రం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయి. రెండు జిల్లాలకు పాత కలెక్టర్లు ఉన్నారు. అయినా పాలన పట్టాలెక్కేదెప్పుడోనని జనం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చి ప్రభుత్వ యంత్రాంగమంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. సాధారణంగా సాగే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ సైతం నిలిచి పోయింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యి ఫలితాలు వెలువడిన అనంతరం జూన్ ఆరో తేదీన ఎన్నికల కోడ్ తొలగించారు. సుమారు 80 రోజులు కోడ్ అమలులో ఉండటంతో ప్రజా సమస్యలన్నీ ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. కోడ్ తొలగి సుమారు 22 రోజులవుతున్నా ఇప్పటికీ పాలనా కార్యక్రమాలు పూర్వ స్థితికి చేరలేదు. గత ప్రభుత్వ విధానాల ఫలితంగా ఏర్పడిన ఇబ్బందుల నుంచి జనం ఉపశమనం కోరుకుంటున్నారు. ప్రధానంగా ధరాభారంతో పాటు చెత్త పన్ను ఇతర భారాల ఉపసంహరణ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వీటిపై ప్రభుత్వం విధానపర నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తేగాని ప్రజానీకానికి ఉప శమనం దక్కే అవకాశం లేదు. ఈ క్రమంలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఇప్పుడిప్పుడే తమ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. జనం సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాధాన్యతాక్రమంలో వాటిని పరిష్కరిస్తామని, ఆందోళన చెందొద్దంటూ భరోసా ఇస్తున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇతర జిల్లాల నుంచి వచ్చిన మండల స్థాయి అధికారులు అందరూ ఇంకా అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమ సొంత జిల్లాలకు ఎప్పుడెళ్తామా అన్న మూడ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో తమ సొంత జిల్లాల్లో తమకు అనువైన ప్రాంతాల్లో నియామక ఉత్తర్వులు పొందేందుకు ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నేతలను కలిసే పనిలో వీరంతా నిమగ్నమయ్యారు. ఎంఎల్ఎలు, జిల్లా అధికారులు తమ ప్రాంతాలకు వచ్చినప్పుడే వీరు ఎక్కువ అందుబాటులో ఉంటున్నారు. కొత్త ఎంఎల్ఎలు సైతం తమకు అనుకూలంగా ఉండే అధికారుల కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, నేతలు సిఫార్సు చేసిన వినతులు, అంశాలపైనే అధికారులు స్పందిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో తాగునీరు, ఇతర అత్యవసర అంశాలపైనా ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అంతే గానీ రోజువారీ దైనందిన కార్యకలాపాలపై డివిజన్, మండలస్థాయి అధికార యంత్రాంగం పెద్దగా దష్టి సారించడం లేదనే విమర్శలు వినపిస్తున్నాయి. దీంతో మండల స్థాయి నుంచి మున్సిపల్ కార్యాలయం, సచివాయాల్లో అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో పని చేయడం లేదు. మరీ ముఖ్యంగా సచివాయాల్లో అయితే ఆయా సచివాయాల కార్యదర్శులు ఉప్పుడు విధులకు వస్తారో... ఎప్పుడు వెళుతారో ఎవరికి తెలియడం లేదు. ఇక మున్సిపల్ కార్యాలయంలో అయితే ఆయా సెక్షన్ అధికారుల నుంచి సిబ్బంది వరకు సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. దీంతో వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు పూర్తి స్థాయిలో అధికారులు లేక పోవడంతో కార్యలయాల్లో పనులు జరగక ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నూతనంగా గెలచిన ఎమ్మెల్యేలు పాలనపై దృష్టి సారించి, ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న మండల ముండల స్థాయి అధికారులను సొంత జిల్లాలకు తీసుకొస్తే పాలన గాడిన పడే అవకాశం ఉంది. ప్రభుత్వ విధానపర నిర్ణయాలు, పథకాల మాట ఎలాగున్నా తాము రోజువారీ ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు కొన్నయినా పరిష్కారమవుతాయని జనం ఎదురుచూస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు త్వరిగతిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేక్‌కట్ చేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

ఘనంగా గణాంకాల దినోత్సవం

ధర్మవరం టౌన్ :పట్టణంలోని శ్రీసాయిడిగ్రీ కళాశాలలో శుక్రవారం గణాంకాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో కరస్పాండెంట్ చాంద్‌భాషా, ప్రిన్సిపల్ ఫణికుమార్, ఆధ్యాపకులు, విద్యార్థులు కేక్ కట్ చేసి గణాంకాల దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం గణాంక శాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆక్రమ్, డాక్టర్ సుబ్బారావు, పోలా ప్రభాకర్, బీఆర్ రంగనాథ్, రమణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నోరు విప్పిన పాలక వర్గం

ప్రజాశక్తి-హిందూపురం

చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏమి ఫలితం ఉంటుంది అన్నట్టు ఉంది హిందూపురం పురపాలక సంఘ పాలక వర్గం పరిస్థితి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో ప్రజా సమస్యల పైన కాసింతైనా దృష్టి సారించని పాలకవర్గం సభ్యులు తీరా అధికారం కోల్పోయాక ప్రజా సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. 4 నెలల విరామం అనంతరం శనివారం హిందూపురం పురపాలక సంఘ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన బాలకృష్ణకు, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా అధికారంలో ఉన్న ప్రతిపక్ష సభ్యులకు హిందూపురం పట్టణ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధికి సహకరించాలని కోరారు. గతంలో మంజూరైన రూ. 66 కోట్ల నిధులతో పాటు పట్టణానికి అవుటర్ రింగ్ రోడ్డు, ఇతర అభివృద్ధి పనులను జరిగే విధంగా చూడాలని సూచించారు. దీనిపై ప్రతిపక్ష నేత రమేష్ కుమార్ మాట్లాడుతు పురపాలక సంఘంలో అధికారంలో ఉన్న వారు అభివృద్ధి కోసం సూచించిన ప్రతి అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతామన్నారు. పెద్ద ఎత్తున నిధులను తీసుకొని వచ్చి అందరం కలిసి పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేద్దామన్నారు. 2018లో పట్టణాభివృద్ధి కోసం బాలకృష్ణ మంజూరు చేయించిన రూ. 66 కోట్ల నిధులు తీసుకురావడానికి ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేస్తున్నామన్నారు. గడిచిన కాలాన్ని గుర్తు చేసుకోకుండా పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అన్ని విధాల అభివద్ధి చేద్దామన్నారు. అనంతరం అజెండాపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు అసిఫ్, శివ మాట్లాడుతు పట్టణంలో నీటి ఎద్దడి లేకపోయినప్పటికీ ఉన్న కరువు నిధులలో దాదాపు రూ. 2.50 కోట్లు వెచ్చించడంపై తప్పు పట్టారు, దీనిపై సమగ్ర వివరణ ఇవ్వాలని అధికారులను కోరారు. వీటితో పాటు మరి కొంతమంది కౌన్సిలర్లు ప్రజా సమస్యలపై మాట్లాడారు. అజెండాలోని అంశాలతో పాటు టేబుల్ అజెండాలోని రెండు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అయితే శనివారం జరిగిన సమావేశంలో పాలక పక్షం సభ్యులు ప్రజా సమస్యలపై చర్చించడంపై పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా, కౌన్సిల్ సభ్యులతో పాటు ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

లోక్‌అదాలత్‌లో రాజీ కేసులకు చక్కటి పరిష్కారం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని పుట్టపర్తి జూనియర్ జడ్జి కె .రాకేష్ తెలిపారు. శనివారం పుట్టపర్తి కోర్టు లో జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐపిసి (సిసిలు)105 చెక్ బౌన్స్ 2 కేసులలో రూ. 34 లక్షల మొత్తానికి పరిష్కారం చేశారు. బాంక్ రుణాలకు సంబందించిన పి ఎల్ సి 4 కేసులలో రూ. 3.65 లక్షల పరిహారం, మద్యం కేసులు 2. మనీ సూట్ లకు సంబందించిన ఈపీ కేసులు 3 కేసులతో కలుపుకొని 116 కేసులు లోక్ అదాలత్ లో పరిష్కరించబడ్డాయి. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కె రాకేష్ మాట్లాడుతూ రాజీ కాదగ్గ కేసులకు చక్కటి పరిష్కార వేదిక లోక్ అదాలత్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి బార్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు రాజేంద్రప్రసాద్ రెడ్డి, లెక్కల యదుభూషన్ , ఇందిర, లెక్కల కృష్ణప్రసాద్ , శ్రీనివాసులు, లోక్ అదాలత్ సభ్యులు డి నాగేంద్ర, జయభారతి రెడ్డి, చల్లా చంద్రశేఖర్, కృష్ణమూర్తి, కె .శ్రీనివాసులుచ మౌనిక, ఎమ్ఎల్‌టిసి లక్ష్మి నాయక్, ఎస్ఐలు సురేష్ కుమార్, కృష్ణమూర్తి, సెబ్ సిఐ కామయ్య, ఎస్ఐ రమణారెడ్డి, యూనియన్ బాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, స్టేట్ బాంక్ సిబ్బంది, మూడు మండలాల కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు

హిందూపురం :కేసులను త్వరితగతిన పరిష్కరించడమే లోక్ అదాలత్ ఉద్దేశమని స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించవచ్చుఅని అన్నారు. చిన్నపాటి వివాదాలు, తగాదాలకు పోలీస్ స్టేషన్లలో, న్యాయస్థానాల చుట్టూ తిరగడం వల్ల అటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు ఇటు మానసికంగా కూడా అవస్థలు పడాల్సి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలన్నారు. అదేవిధంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం తరపున న్యాయవాదులను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రెండు బెంచీలను ఏర్పాటు చేసి 118 కేసులను పరిష్కరించారు. పలు కేసులకు సంబంధించి వెంటనే అవార్డు ప్రతులను కక్షిదారులకు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ. రాజశేఖర్ ఆధ్వర్యంలో కక్షి దారులకు, తదితరులకు బోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో లోక్ అదాలత్ సభ్యులు సంతోషి కుమారి, నవేరా, నరసింహమూర్తి, ఈశ్వరప్ప, పలువురు న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో నిర్వహించిన లోక్ అదాలత్

పెనుకొండ టౌన్ :జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 81 కేసులు పరిష్కారం అయినట్లు సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ తెలిపారు. బ్యాంకు లకు సంబంధించిన ఇతర కేసుల్లో రాజీతో పరిష్కారం చేసినట్లు ఆయన చెప్పారు. రాజీమార్గంతోనే సత్వరం కేసులు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, లాయర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని గుడ్డంపల్లి తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన చెత్రేనాయక్ (లాయర్) విద్యాసామగ్రిని అందజేశారు. చెత్రేనాయక్ పిల్లలు లహరి, లక్ష్మినరసింహ పుట్టినరోజు సందర్భంగా గుడ్డంపల్లితండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, నోటుపుస్తకాలు , పెన్నులు, పెన్సిల్లు, బలపాలు, స్టేషనరి వస్తువులు అందజేశారు. ఈసందర్భంగా చెత్రేనాయక్‌కు ఉపాధ్యాయులు సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫకృద్దీన్, నరసింహులు, మునేనాయక్, నారాయణస్వామి నాయక్, నిర్మల, సాయిలీల, వరలక్ష్మి, సుశీల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - లేపాక్షి

జూలై 8 నుంచి మూడు రోజుల పాటు ఎఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రస్థాయి శిక్షణతరగతులకు సంబందించిన కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాకినాడలో జులై 8, 9, 10 తేదీలలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. వీటిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి పవన్, సంత్, త్రిదేవ్, అనిల్, మునప్, నితిన్, ప్రశాంత్, మంజునాథ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

అల్ట్రా విజన్ ఐ కేర్ హాస్పిటల్స్' డాక్టర్ బొగ్గు సురేష్ సారథ్యంలో మండలకేంద్రంలో 'మా' మెడికల్స్ ఫిరోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నల్లమాడ, ఓడి చెరువు, అమడగూరు, గోరంట్ల మండలాల నుంచి కంటి సమస్యలు ఉన్న 133 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో శస్త్ర చికిత్సలకు అవసరమైన 26 మందికి పుట్టపర్తి లోని సత్యమ్మ గుడి సమీపంలోని అల్ట్రా విజన్ ఐ కేర్ హాస్పిటల్ నందు ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, రాజేష్, అనిత, అమృత వర్షిని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఓబుల దేవర చెరువు: విద్యతోనే ఉన్నతశిఖరాలను చేరుకోవచ్చని మండలంలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రియాజ్ అన్నారు. స్థానిక పాఠశాలలో శనివారం నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు,ఉపాధ్యాయులు బడికి మానేసిన విద్యార్థులను బడిలో చేర్చడం, పిల్లలను బడి మానకుండా ఉండేటట్లు చూడడం లాంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సీజనల్ వ్యాధుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి

ప్రజాశక్తి - రొద్దం

విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని నియోజకవర్గ మీటర్ రీడర్ల యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం పెనుకొండలోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో మంత్రి సవితను కలిసి తమ సమస్యలు విన్నవించారు. స్పందించిన ఆమె సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిడిసిఎల్ వర్కింగ్ ప్రసిడెంట్ అర్ .కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు బి. దస్తగిరి, జిల్లా అధ్యక్షులు శాన్వాజ్ జిటి రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

విడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, జేసీ, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీపై శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ రాష్ట్ర సచివాలయాల నుంచి కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సత్యసాయి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 1న 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. జిల్లాలో 2,70,966 మందికి సుమారు రూ.184.70 కోట్లు పంపిణీ చేయనున్నామన్నారు. జిల్లాలోని 544 సచివాలయాల్లో 4349 మంది ప్రభుత్వ ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. అదనపు సిబ్బందిగా వివిధ ప్రభుత్వ శాఖలోని జూనియర్ అసిస్టెంట్లను, సిబ్బందిని వినియోగిస్తున్నామని వివరించారు. ఇందుకు సంబంధించి యంత్ర పరికరాలను అందించడం జరిగిందన్నారు. గిరిజన మండలాల్లో పింఛన్ల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిఎస్ మాట్లాడుతూ అవసరమైతే ఇతర శాఖల అధికారులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, పిఎల్‌పిఐ శివకుమారి, ఎల్‌డిఎం రమణ కుమార్, డిపిఐ ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం :ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే టిడిపి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని టిడిపి మండల కన్వీనర్ మల్లి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి హామీల్లో భాగంగా చెప్పిన విధంగా వెయ్యి రూపాయల పింఛన్ పెంచుతూ ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ జులై 1వ తేదీన ఏప్రిల్ మే జూన్ నెలలతో కలిపి 7వేల రూపాయలు పింఛను అందిస్తున్న ఘనత చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని తెలిపారు. పింఛన్లను పంపిణీ కార్యక్రమాన్ని ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా పేరుతో ఇంటి వద్దకే అధికారులు వచ్చి పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు.

కొత్తచెరువు : జూలై 1న ప్రభుత్వం పెంచిన పింఛన్ల మొత్తాన్ని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు విజయవంతంగా పంపిణీ చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్ తెలిపారు. శనివారం కొత్త చెరువులోనే ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిద్దారెడ్డి, కార్యదర్శులు గంగాధర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రావణ్, రామ్ గోపాల్ రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించే పింఛన్లను సచివాలయ సిబ్బంది పింఛనుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ కోరారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని 39 వార్డుసచివాలయాల పరిధిలో 18,502 పింఛనుదారులకు సోమవారం ఉదయం 6గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పంపిణీచేయడం జరుగుతుందన్నారు. ఈ పంపిణీ రెండు రోజులపాటు అందజేస్తామన్నారు.

సోమందేపల్లి :పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని పింఛనుదారులకు సోమవారం ఇళ్ల వద్దకే అందజేయడం జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 6 గంటల నుండే పింఛనుదారుల ఇంటి వద్దనే పెన్షన్ డబ్బులు పంపిణీ చేస్తారని తెలిపారు.

నైతిక విలువలు ఉంటే వెంటనే రాజీనామా చేయండి

టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్ప చౌదరి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఏమాత్రం నైతిక విలువలు ఉన్నా మున్సిపాలిటీ చైర్మన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని టిడిపి కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి డిమాండ్ చేశారు. శనివారం మున్సిపాలిటీ అత్యవసర సమావేశం చైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రత్నప్ప చౌదరి మాట్లాడుతూ ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో మునిసిపాలిటీలో టిడిపికి 4700 ఓట్లు మెజార్టీ వచ్చిందన్నారు. దీనిని రెఫరండంగా తీసుకొని వైసిపి చైర్మన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో ప్రజల సమస్యలు సమావేశంలో చర్చించాలి తప్ప రాజకీయాలు చేయడం తగదన్నారు. దీంతో రత్నప్ప చౌదరి మాట్లాడుతూ తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం తదితర సమస్యలపై ప్రశ్నించారు. చైర్మన్ ప్రాతినిధ్యం వహిస్తున్న రెండవ వార్డులో నీటి సమస్య పరిష్కరించాలని ఇటీవల అవార్డు మహిళలు మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారని గుర్తు చేశారు. వైసిపి కౌన్సిలర్లు చెరువు భాస్కర్ రెడ్డి, సూర్య గౌడ్ మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఏఈని నియమించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొడి చెత్త తడి చెత్త తీసుకెళ్లే వాహనాలు కొత్తవి ఉన్నా అవి నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. కౌన్సిలర్ లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో నీటి సమస్య, పారిశుధ్యం లోపించడం సరికాదన్నారు. గోకులం వెంకటరమణ మాట్లాడుతూ పారిశుధ్యం పై తాము ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ కార్మికులు అయినందున తాము గట్టిగా చెప్పలేకపోతున్నామన్నారు. నిధులు ఉన్న పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు సమస్యలు ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని చైర్మన్ ఓబుళపతి అధికారులను ప్రశ్నించారు. సభ్యులు సభ దృష్టికి తెచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ సోమశేఖర్, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, వైస్ చైర్మన్లు శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న జిల్లాలోని ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఇఒ మీనాక్షికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా పుట్టకొస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. పుట్టపర్తి లోని వారధి, గుడిబండలో సైనిక వర్షా పాఠశాల అనుమతులు లేకున్నా అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని విమర్శించారు. పలు ప్రయివేటు పాఠశాలల్లో వేలాది రూపాయలు పుస్తకాలకు, ఫీజులకు వసూలు చేస్తున్నా అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని దీంతో ఆయా పాఠశాలలు విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు హర్ష, హరి ,భరత్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్పొరేట్ కంపెనీలకు పాలకులు ఊడిగం : సిఐటియు

సమావేశంలో మాట్లాడుతున్న జివిఎల్. నరసింహులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు అన్యాయం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్. నరసింహులు విమర్శించారు. శనివారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో సిఐటియు పట్టణ మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య వక్తగా హాజరైన జిఎల్ నరసింహులు హాజరై మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాలే లక్ష్యంగా సిఐటియు ఐక్యత పోరాటం అనే నినాదంతో అన్ని రంగాల కార్మికులను ఐక్యం చేస్తూ అనేక పోరాటాలను నిర్వహిస్తోందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్ పేరుతో కార్మికుల పొట్ట కొడుతూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలోని గత ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగులు పట్ల అనుసరించిన నియంతృత్వం విధానాలను తిప్పికొడుతూ ప్రజలు వైసిపికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. అనంతరం సిఐటియు పట్టణ కమిటీని 23 మందితో ఏర్పాటు చేశారు.కన్వీనర్‌గా ఎస్ జగన్ మోహన్, కో కన్వీనర్లుగా రామ్మోహన్, ముస్తాక్, మాబున్నీసాతో పాటు 19 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని డి.యర్ కొట్టాల గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త ర్యాంకుల భాస్కర్ అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరమ్మ, చిన్నప్పయ్య, నరసింహులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యరకమంలో మండల నాయకులు చిన్నమంతూరు పవన్, శ్రీనాథ్, క్రిష్టప్ప, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి గోరంట్ల

హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికే పార్థసారథిని బెంగళూరు ఎయిర్ పోర్టులో గోరంట్ల టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హిందూపురం పార్లమెంటు సభ్యులు బి కే పార్థసారథి పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేసి తిరిగి నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో బెంగళూరు ఎయిర్ పోర్టుకు గోరంట్ల టిడిపి నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ టిడిపి కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, నీలకంఠారెడ్డి, బెల్లాల చెరువు చంద్ర, ఫిరోజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలో హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె. పార్థసారథిని ఆయన కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం కలిశారు. పార్లమెంట్ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసి మొదటి సారి పెనుకొండ నియోజకవర్గానికి వచ్చిన బికెను బెంగళూరు విమానాశ్రయంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టోల్ గేట్ వద్ద, కొడికొండ చెక్ పోస్ట్, తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన నాయకులు,కార్యకర్తలు, అభిమానులు బికెను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెనుకొండ పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశ్వర్థనారాయణ, రవిశంకర్, అత్తర్ ఖదీర్ బాషా, కన్నాస్వామి, వెంకటగిరి పాళ్యం శ్రీనివాసులు,మురళి, గోపాల్, గొల్లపల్లి బాబుల్ రెడ్డి, జావీద్, శీనా, బాలు నాయక్, నాని, గాయిత్రి, తులసి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సేవలు అందించిన ఉద్యోగులకు గుర్తింపు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అంకితభావంతో ప్రజలకు అందించిన సేవల వల్లే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి విజయకుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్లో గణాంకాల అధికారిగా పనిచేస్తున్న రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా సాయి ఆరామం అతిథిగృహంలో ఆయనను శనివారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగ సంఘాల నాయకులు పలువురు ఉద్యోగులు ఈ ఆత్మీయ సత్కారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఒ మాట్లాడుతూ రమేష్ తన విధి నిర్వహణలో అంకితభావంతో నిబద్ధతతో క్రమశిక్షణతో నిజాయితీగా పనిచేసి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, బంధువులు శాలువాలు పూలమాలలతో రమేష్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీ ప్రకాష్, ఏపీఆర్‌వో ఫక్రుద్దీన్, మాజీ ఎన్జీవో నాయకులు నరసయ్య, వైఎస్ఒ పద్మావతి, ఎస్ఒ అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు :మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ స్కూల్లో రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న. గడ్డం నరసింహులు శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయనను గ్రామస్తులు,ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి రిటైర్డ్‌మెంట్ సహజమని అన్నారు. వారు ఉద్యోగ సమయంలో నిబద్ధతతో నిర్వహించిన విధులే వారికి సమాజంలో ఒక ప్రత్యేక స్థానాన్ని తెచ్చిపెడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ :అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, బాధ్యతాయుతమైనది అనిమాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న విశ్వనాథ్ ఉద్యోగ విరమణ చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ విశ్వనాథ్ స్వగ్రహానికి వెళ్లి విశ్వనాథ్ దంపతులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పిసి గంగన్న, నాయకులు దయ్యాల ఉమాపతి, పలువురు ఉద్యోగులు, అడ్వకేట్ శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ :నిజాయితీ అధికారుల సేవలు ప్రజలకు మరికొంత కాలం అవసరమని డిఆర్‌డిఎ పీడీ నరసయ్య పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో డిపిఎంగా పనిచేస్తున్న రమణప్ప ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా శనివారం స్థానిక ఆర్‌వి. జానకిరామయ్య కళ్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీడీ మాట్లాడుతూ నిజాయితీగా పని చేస్తున్న అధికారుల సేవలు మరికొంత కాలం అవసరమని పేర్కొన్నారు. దాదాపు 30 సంవత్సరాల పాటు డిఆర్‌డిఎలో పనిచేసిన రమణప్ప ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు ఉద్యోగులతో సఖ్యతగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ కార్యాలయ అధికారి సత్యనారాయణతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన డిఆర్‌డిఎ ఉద్యోగులు, కర్నూలు జిల్లాకు చెందిన డిఆర్‌డిఎ ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్దిలేరు వంతెనకు మరమ్మతులు చేయించండి

ప్రజాశక్తి ముదిగుబ్బ

మండలంలోని మద్దిలేరు వంతెనకు మరమ్మతులు చయించాలని మండలంలోని కొడవండ్లపల్లి వాసులు కోరారు. ఈ మేరకు వారు శనివారం మండలకేంద్రంలో ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు ఆమట్లాడుతూ గతంలో వరద ఉధృతి వల్ల కొడవండ్ల పల్లి గ్రామ సమీపంలో ఉన్న మద్దిలేరు వంతెన కూలిపోయిందన్నారు. ప్రభుత్వం తాత్కాలికంగా మట్టి తొలి మరమ్మతులు చేపట్టారన్నారు. కాలక్రమంగా వర్షాలకు అక్కడ మట్టి కోతకు గురయ్యి రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. వర్షాకాలంలో మద్దిలేరు ప్రవాహంతో తల్లిదండ్రులు విద్యార్థులను బడికి పంపలేకపోతున్నామన్నారు. అలాగే ఈ వంతెన మీదుగా దాదాపు 30 గ్రామాల ప్రజలు అనంతపురం, ధర్మవరం వైపు ప్రయాణం సాగించడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని గ్రామస్తులు ఎంపిపిని కోరారు.

ఇంటిస్థలాలు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

తమకు ఇంటి స్థలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ నాయకులు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధు సూదన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు వారు శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో చిలకం మధుసూదన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు విన్నవించారు. పట్టణంలో దాదాపు 400 మంది ఆటో కార్మికులు అద్దె ఇళ్లలో ఉంటూ చాలీచాలని ఆటోసంపాదనతో కాలం నెట్టుకొస్తున్నామన్నారు. ఆటో కార్మికులలో ఇంటిస్థలాలు లేనివారికి ఇంటిస్థలాలు ఇప్పించేలా చూడాలని వారు చిలకం మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. స్పందించిన చిలకం సమస్యను మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, ట్రాన్స్‌పోర్ట్ రంగం రాష్ట్రనాయకులు రఫి, రవి, జిలాన్, రియాజ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఆటోయునియన్ నాయకులు

మెడికల్‌షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలకేంద్రంలోని పలు మెడికల్ షాపులను వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి రమేష్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. మందులు నాణ్యమైనవేనా? నాసిరకం మందులు విక్రయిస్తున్నారా తదితర అంశాలను ఆయన ఆరా తీశారు,

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఉసూరుమనిపిస్తున్న వానలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జూన్ నెల ప్రారంభంలో ఎడతెరిపిలేని వర్షాలు పడ్డాయి. ఖరీఫ్ ప్రారంభంలోనే వానలు పడటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. గతేడాది నెలకొన్న కరువు నుంచి ఈ ఏడాది అయినా బయటపడవచ్చునని భావించారు. ఈ వానలకు దుక్కులు దున్నుకుని పొలాలను సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో వర్షాధారంపై ఆధారపడి సాగు చేసుకునే పంటలకు జులై సరైన అదును. ఈ జులై 15లోపు వర్షాలొస్తే విత్తనం విత్తుకునేందుకు వీలుంటుంది. ఈ సమయంలో పంటసాగు చేస్తే మంచి పంట చేతికొస్తుందన్నది రైతు నమ్మకం. ప్రారంభంలో వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో ఈసారి తమ పంట పండుతుందని భావించారు. తీరా చూస్తే జూన్ మూడవ వారం నుంచి వానలు ఎత్తిపెట్టినట్టు కనిపిస్తున్నాయి. గత వారం రోజులుగా పెద్దగా వర్షాలు పడిన దాఖలాలు కనిపించడం లేదు. ఆశలు రేకెత్తించిన వరణుడు అదునులో మొఖం చాటేసినట్టు కనిపిస్తోంది. దీంతో రైతుల్లో మళ్లీ గుబులు రేగుతోంది. వానలు అసలైన సమయంలో ఏమి చేస్తాయోనని భయపడుతున్నారు. ఒకవైపు పంటకు అవసరమైన పెట్టుబడి సాయంగాని, పంటలబీమాగాని ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇది ఏమవుతుందో కూడా తెలియక అయోమయ పరిస్థితుల్లోనున్నారు. డబ్బుల కోసం కూడా అనేక అవస్థలు పడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం పెట్టుబడి సాయం, బీమా రెండూ ఇస్తే ఈసారి సాగుకు అవసరమైన ఖర్చులకు కష్టాలు తప్పుతాయని రైతులు భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఇకపోతే సాగునీటి కష్టాలు తప్పేలాలేవు. జిల్లాకు సాగునీటిని అందించే తుంగభద్ర, శ్రీశైలం రెండింటిలోనూ ఆశించిన నీరు రాలేదు. తుంగభద్ర డ్యామ్‌లో ఇప్పటికి నామ మాత్రంగానే నీరు చేరింది. డ్యామ్ పై భాగంలో పెద్దగా వర్షాలేవీ పడలేదు. జలవనరుల శాఖ అధికారులు మాత్రం వచ్చే నెల 20వ తేదీ నుంచి తుంగభద్ర డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాని మంచి వర్షాలు పడి డ్యామ్‌కు నీరొస్తేనే అది సాధ్యమవుతుంది. లేకపోతే తాగునీటికి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే గతేడాది వర్షాభావంతో పెద్దగా నీరు రాలేదు. జిల్లాలోనున్న డ్యాముల్లో నీటి నిలువలు నామ మాత్రంగానే ఉన్నాయి. ఇకపోతే ఈ వారంలో రాజకీయంగా కొత్త ప్రభుత్వం కొలువుదీరి పనిని ప్రారంభించింది. వచ్చే నెల ఒకటవ తేదీన సామాజిక పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం చేసింది. ఇప్పటి వరకు ఉన్న మూడు వేల రూపాయల పింఛనును నాలుగు వేల రూపాయలకు పెంచడమే కాకుండా పాత నెలలకు కలిపి ఏడు వేల రూపాయలు ఇవ్వడానికి చర్యలు చేపట్టింది. వచ్చే వారంలో జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో రాజకీయంగానూ తెలుగుదేశం నాయకులు తమ పార్టీ అధికారంలోకి వస్తూనే సంక్షేమాన్ని మరింత ముందుకు తీసుకెళుతోందని ప్రకటించుకునేందుకు ఉత్సాహపడుతున్నారు. మంగళవారం జరిగే పంపిణీలో పెద్దఎత్తున పాల్గొనాలని ఆ పార్టీ శ్రేణులను పిలుపునిచ్చియున్నారు. అయితే మొదటి సంతకం చేసిన డీఎస్సీపై మాత్రం నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మెగా డీఎస్సీని మోసం చేసారంటూ నిరసనలు చేపడుతున్నారు. శనివారం నాడు అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టడం గమనార్హం.